గణపయ్యకు ప్రత్యేక పూజలు



అల్వాల్: కానాజీగూడ మరకత శ్రీలక్ష్మీగణపతి దేవస్థానంలో 32 ఔషధీకృత ద్రవ్యాలతో మొదకములు, తేనే, మల్లె, తామర పుష్పాలతో గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహకులు మోత్కూరు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి మూల మంత్రం, మహాలక్ష్మి హోమం వంటి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త జ్యోతి, భక్తులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ కానాజీగూడ గ్రాండ్ విస్టా, మానస సరోవర్ విల్లాస్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ రీమోడలింగ్, రోడ్డు వేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనిల్‌కిషోర్, కాలనీవాసులు బాలకృష్ణ, మనీష్, సూర్యప్రకాష్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి : డివిజన్ మారుతినగర్, నెహ్రూనగర్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ సునీత అన్నారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ఏఈ మధురిమతో కలిసి ఆయా ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. సీసీరోడ్డు నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు దర్శిరెడ్డి, మల్లికార్జున్, సుధాకర్, బీజేపీ నేతలు శివగౌడ్, వెంకటేష్‌నేత, శ్రీనివాసయాదవ్, రమణ, ఒగ్గు మురళీ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ బాగు చేయరూ !

15 రోజులుగా పనిచేయని వైనం



మల్కాజిగిరి: సర్కిల్ కార్యాలయంలో లిఫ్ట్ పని చేయకపోవడంతో సర్కిల్ ఉప కమిషనర్ చాంబర్ రెండో అంతస్తులో ఉండటంతో ప్రజలు, దివ్యాంగులు అక్కడికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 15 రోజుల నుంచి లిఫ్ట్ పనిచేయడం లేదని, నిర్వహణ బాధ్యతలు చూసే ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి సమస్యను తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిర్వహణ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవడంతోనే మరమ్మత్తులు చేయలేదన్న ఆరోపణలున్నాయి. త్వరితగతిన లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 90 లక్షలతో అభివృద్ధి పనులు

ఉప్పల్: రామంతాపూర్ శ్రీరమణపురం స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరైనట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి బుధవారం కాలనీవాసులకు మంజూరుపత్రాన్ని అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న ప్రత్యేక దృష్టి కారణంగానే నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, శ్రీరమణపురం కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'మీన్స్' హెల్త్ కేర్ సెంటర్ సందర్శన

ఉప్పల్: ఉప్పల్‌లోని మీన్స్ మెంటల్ అండ్ జనరల్ హెల్త్‌కేర్ క్లినిక్, అండ్ హోమ్‌ను బుధవారం రామంతాపూర్ హోమియోపతి కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. మానవత్వం, సేవాదృక్పదంలో నడుస్తున్న హోమ్‌ను సందర్శించి కమ్యూనిటీ సర్వీస్‌లను తెలుసుకున్నారు. అక్కడున్న వారు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్రంలో ఇచ్చే వసతులపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కళాశాల ప్రిన్సిపాల్ అయూష్ అడిషనల్ డైరెక్టర్ లింగరాజు, మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కేంద్రం ఫౌండర్ డాక్టర్ ప్రకాష్ం పాల్గొన్నారు.

సంతలతో చింతలు !

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌కు దారి దొరకని వైనం | ప్రభుత్వ స్థలాల్లోకి తరలించాలని కోరుతున్న ప్రజలు

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలో సోమవారం నుంచి ఆదివారం వరకు ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలోని ప్రధాన రోడ్లలో వారం రోజుల పాటు నిర్వహించే వారంతపు సంతల వలన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాదచారులు, వాహనదారులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఇతర వాహనాలు రావడానికి అవకాశం లేకుండా తోపుడు బండ్లతో నిండిపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రామంతాపూర్ ప్రధాన రహదారి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఎదురు వీధిలోని మార్కెట్ వీధి నెహ్రూనగర్ నుంచి ఇందిరానగర్ జెండా వరకు ప్రతి సోమవారం నిర్వహించే అతిపెద్ద కూరగాయాల సంతలో దాదాపు 200 మంది విక్రయదారులు రోడ్డుకి ఇరువైపులా విక్రయిస్తుంటారు.

◆ ఈ వీధిలోని నెహ్రూనగర్ చౌరస్తా వద్ద అతిపెద్ద బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు, మార్కెట్ వీధి నుంచి ఇందిరానగర్, ప్రగతినగర్, డిమార్ట్‌కు వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా వ్యాపారం చేసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదని, ఇరుకురోడ్లలో నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

చిన్న చెరువుకు తరలించాలి

ప్రతి సోమవారం నిర్వహించే నెహ్రూనగర్, ఇందిరానగర్ కూరగాయాల సంతను సమీపంలో ఉన్న చిన్న చెరువు విశాల ప్రాంగణంలోకి తరలిస్తే అటు వినియోగదారులకు ఇటు విక్రయదారులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవని స్థానిక ప్రజలు అంటున్నారు. రామంతాపూర్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సంతలను కూడా ప్రభుత్వ భూముల్లోకి తరలించాలని స్థానిక సంక్షేమ సంఘం నేతలు కోరుతున్నారు.



రామంతాపూర్ మధురానగర్‌లోని సంత

అర్ధరాత్రి వరకు ఆటోట్రాలీల శబ్దం

నెహ్రూనగర్ ఇందిరానగర్ వారంతపు సంతలో ఆటో ట్రాలీల్లో కూరగాయాలు ఇతర సామగ్రితో నగరంలోని వివిధ ప్రాంతాల్లోని వ్యాపారస్తులు వచ్చి ఈ సంతలో విక్రయిస్తుంటారు. రాత్రి 11 వరకు కొనసాగితే ఈ సంత ముగిసిన తర్వాత ఒంటిగంట వరకు ఆటో ట్రాలీల్లో సామగ్రి తరలించే సమయంలో వచ్చే శబ్దాలతో రాత్రుళ్లు నిద్ర ఉండటం లేదని స్థానికంగా ఉన్న అపార్టుమెంట్‌వాసులు పలుసార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

తైబజార్ అక్రమ వసూళ్లు..

ఉప్పల్ సర్కిల్‌లో నిర్వహించే సంతల్లో చిరు వ్యాపారుల వద్ద వసూలు చేసే తైబజార్ పన్నులను దాదాపు 12 ఏళ్ల క్రితం రద్దు చేశారు. ఈ మధ్య రామంతాపూర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే కూరగాయాల సంతల్లో కొంతమంది జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా తైబజార్ వసూలు చేస్తున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

నెహ్రూనగర్‌లో తీవ్ర ఇబ్బందులు



వీధుల్లో జనావాసాల సముదాయాల రోడ్ల మధ్య నిర్వహించే ఈ సంతతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని అతిపెద్ద బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు ఇతర వాహనాలు అంబులెన్స్ రాకుండా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఉండటంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. దీనిని చిన్న చెరువు ప్రాంగణంలోకి తరలించాలి.

– జగదీష్, నెహ్రూనగర్

రోడ్డుపైనే వ్యర్థాలను వదిలేస్తున్నారు



మధురానగర్, వివేక్‌నగర్‌లలో నిర్వహిస్తున్న వారాంతపు సంతలో సంత ముగిసిన తర్వాత విక్రయదారులు మిగిలిన కూరగాయాలు వ్యర్థాలను రోడ్లపైనే వదిలేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రెండు సంతలను బైపాస్ రోడ్డులో ఉన్న విశాలమైన ఖాళీ స్థలంలోకి తరలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– నారాయణదాసు, వివేక్‌నగర్

తరలించేందుకు తగిన చర్యలు



మార్కెట్ వీధి నెహ్రూనగర్ నుంచి మొదలుకుని ఇందిరానగర్ జెండా వరకు నిర్వహించే వారాంతపు సంత వల్ల నెహ్రూనగర్, ఇందిరానగర్ ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని పలుసార్లు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకొచ్చాను. ఈ సమస్యను జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చి సంతను చిన్న చెరువు ప్రాంగణంలోకి తరలించడానికి చర్యలు తీసుకుంటాం.

– బండారు శ్రీవాణి, కార్పొరేటర్

వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరిస్తాం

రామంతాపూర్ : చిన్న చెరువు కట్టపై ఇరువైపులా విపరీతంగా పెరిగిన చెట్లకొమ్మలతో ఉదయం, సాయంత్రం పూట నడకకు ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని వాకర్స్ ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి హార్టికల్చర్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించి వాకింగ్‌ట్రాక్ అడ్డంగా పెరిగిన పిచ్చి మొక్కలు చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. ఆమె మాట్లాడుతూ.. చీకటి పడిందంటే చాలు వాకింగ్ ట్రాక్ చిన్న చెరువు ప్రాంగణంలో కొంతమంది పోకిరీలు అడ్డాగా చేసుకుని గంజాయి మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించి వాకింగ్‌కు వచ్చేవారిని వేధిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రాత్రులు చెరువుకట్టపై పర్యవేక్షణకు పోలీసులు నియమించాలని ఉన్నత పోలీసు అధికారులను కోరతామన్నారు. వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనులు మూడ్రోజుల పాటు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



వాకింగ్ ట్రాక్‌లోని పొదలను తొలగిస్తున్న దృశ్యం

ట్రాఫిక్‌పై స్పెషల్ డ్రైవ్

కుషాయిగూడ: కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు చిరు వ్యాపారులపై కొరడా ఝులిపించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కుషాయిగూడ, చక్రిపురం వరకు ప్రధాన రహదారి వెంట వ్యాపారాలు నిర్వహిస్తున్న తోపుడు బండ్లు, జ్యూస్, గప్‌చుప్, మిర్చి బండ్లను తొలగించారు. మల్కాజిగిరి ట్రాఫిక్ డివిజనల్ డీసీపీ లక్ష్మి పర్యవేక్షణలో ఈ డ్రైవ్ కొనసాగింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వ్యాపారాలు నిర్వహించకూడదని వారికి అవగాహన కల్పించారు. ప్రదాన రోడ్ల వెంట బండ్లు నిలిపి వ్యాపారాలు చేయడం వల్ల కొనుగోలుదారులు వాహనాలు రోడ్లపై నిలిపడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల వెంట వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరాజు సిబ్బంది పాల్గొన్నారు.



కుషాయిగూడ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మల్లాపూర్: సీసీరోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. బుధవారం నాచారం సావర్కర్‌నగర్ కాలనీలో రూ.50 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సావర్కర్‌నగర్‌లోని గురుకుల పాఠశాల డ్రైనేజీ సమస్యను కుడా పరిష్కరిస్తామన్నారు. ఏఈ వినీత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, సంతోష్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, కాలనీవాసులు రాంరెడ్డి, రమేష్, శర్మ తదితరులున్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



చర్లపల్లి ఇన్‌స్పెక్టర్‌ను సత్కరిస్తున్న ఆటోయూనియన్ సభ్యులు

మల్లాపూర్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం చర్లపల్లి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను మల్లాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన కాప్రా ఆటో యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌టీయూ కాప్రా సర్కిల్ ఆటోయూనియన్ అధ్యక్షుడు రామాంజనేయులు, గోపాల్‌నాయక్, నరేష్, శ్రీను, రమేష్, నర్సింగ్, ప్రవీణ్, హనుమంతు, మహేష్, సురేష్, రవికుమార్, హనుమంత్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: అల్వాల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌కు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్‌రావు, సౌందరేశ్వర్, రాజసింహారెడ్డి, పాపారావు, పద్మాచారి, గోపాల్‌రావు, వెంకటనారాయణ, రామచంద్రయ్య, లక్ష్మణ్, ఐఆర్‌సీఎస్ మొబైల్ మెడికేర్ యూనిట్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శిగా బోడుప్పల్‌కు చెందిన గోనె శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తం చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపు పేద విద్యార్థుల కుటుంబాలకు తనవంతు కృషి చేస్తానన్నారు. పదవి రావడానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం



శ్రావణి

బోడుప్పల్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన బుధవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వేలంగి రావు, శ్రావణి (26) భార్యభర్తలు. బోడుప్పల్ దేవేందర్‌నగర్ కాలనీలో శ్రావణి సోదరి సుమలత నివాసం ఉంటోంది. వారింట్లోనే నెలరోజులుగా ఇద్దరు దంపతులు ఉంటున్నారు. కాగా 28న భర్త నైట్ డ్యూటీకి వెళ్లాడు. కాగా భార్య సోదరితో కలిసి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారి చూసేసరికి భార్య కనిపించలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త సినీ ప్రపంచం 'యూకే సినీప్లెక్స్'



ప్రారంభిస్తున్న దిల్‌రాజు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్: వినోదానికి నూతన శిఖరం యూకే సినీప్లెక్స్ అని సినీ నిర్మాత దిల్‌రాజు అన్నారు. బుధవారం నాచారంలో నూతనగా ఏర్పాటు చేసిన యూకే సినిప్లెక్స్ థియేటర్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. థియేటర్ యజమాని ఉదయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ మాజీ కో – ఆప్షన్ మెంబర్ విద్యా స్రవంతి, గ్రేటర్ బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్, సునీల్, భరత్, శిరీషారెడ్డి, రుషిల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

కలెక్టర్ మనుచౌదరితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడి, ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిని ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, వాటిని ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన పలు అంశాలపై కలెక్టర్ మనుచౌదరితో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 6 అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్లు, లైబ్రరీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి సరిపడా నిధులు మంజూరై ఉన్నాయని, భవన నిర్మాణాలు చేపట్టడానికి స్థానికంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కబ్జా భారిన పడుతున్న ప్రభుత్వ భూములను కేటాయిస్తే జీహెచ్‌ఎంసీ వెంటనే యూపీహెచ్‌సీలు కట్టడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

◆ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకుని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు కేటాయిస్తే జీహెచ్‌ఎంసీ నిర్మించగలదన్నారు.

◆ జీవో 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలను గుర్తించి, దరఖాస్తులను మరోసారి పరిశీలించి, జీవో 59 కింద డబ్బులు చెల్లించిన వారికి రెగ్యులరైజేషన్ చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని గతంలో సీఎంఓలో ఇచ్చిన పలు వినతులకు సీఎం కార్యాలయం నుంచి స్పందన లభించిందని, దీనికి సంబంధించి నివేదికను కూడా జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ఆయన చెప్పారు.



కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అధికారులు

కబ్జాల భూములివే..

నియోజకవర్గంలో కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను రక్షించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 844లో ఉన్న 55 ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందన్నారు.

◆ హైదరాబాద్– మేడ్చల్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన భూములకు భౌగోళిక సరిహద్దులు సూచించకపోవడంతో కబ్జాలకు గురౌతున్నాయన్నారు. ఈ స్థలంలో నవోదయ స్కూల్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

◆ హిల్‌టాప్ కాలనీలోని సర్వే నంబర్ 844లో ఉన్న ప్రభుత్వ భూమిని అంగన్‌వాడీ సెంటర్ లేదా మహిళా భవన్ కేటాయించాలని కోరారు.

◆ టెలికాం కాలనీ వినోబానగర్‌లోని సర్వేనెంబర్ 278, యాప్రాల్‌లోని సర్వేనెంబర్ 171, సర్వేనంబర్లు 582, 583లలో ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురికాకుండా పరిరక్షించి, ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలని కోరారు. బీఆర్‌ఎస్ నేతలు అనిల్ కిషోర్‌గౌడ్, సునీత, రమేష్, నరేందర్‌రెడ్డి, చిన్నయాదవ్, పరీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మల్లాపూర్: కాంగ్రెస్‌తోనే మల్లాపూర్ అభివృద్ధి సాధ్యమని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో స్వామి వివేకానంద నగర, ఎస్సీబస్తీ, ఓల్డ్ మల్లాపూర్‌లో సీసీరోడ్డు పనులకు రూ.74 లక్షల నిధులు మంజూరైనందుకు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయికిరణ్‌గౌడ్, పీజీ సుదర్శన్, బాలరాజ్‌గౌడ్, ఎస్వీ కిట్టు, రాజేష్, శ్రీనివాస్, జమీలా, జోష్, గట్టయ్య, పర్వతాలు, మల్లు, సతీష్, సురేష్‌గౌడ్, రింకు, నజ్మా, శ్రావణి, ఇషాత్ బాను తదితరులున్నారు.



బోనాలకు ఆహ్వానం



మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న నేతలు

బోడుప్పల్: ఆగస్టు 3,4వ తేదీల్లో జరగనున్న బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ నేతలు బుధవారం మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖకు ఆహ్వానపత్రాలను అందజేశారు. ఈసారి పెద్ద పండుగ జరుగుతుందని, తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ సత్తిరెడ్డినగర్‌లో జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులకు సూచించారు. సుమారు రూ. 1.25 కోట్లతో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే ముంపు సమస్య పరిష్కారానికి మార్గం సులభమవుతుందన్నారు. లాలాపేట్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ ప్రజల ఇక్కట్లు కూడా తగ్గుతాయన్నారు. డీఈ లౌక్య, వీఏ రజనీకాంత్, ఉమేష్‌సింగ్, బాబు బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్ కాలనీవాసులు పాల్గొన్నారు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

పొగాకు వ్యతిరేక ర్యాలీ



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మల్కాజిగిరి: పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ.. నేరేడ్‌మెట్‌లోని సెయింట్ థామస్ పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పొగాకు వాడకం వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధుల గురించి తెలియజేస్తూ.. ప్లేకార్డ్స్, బ్యానర్లు ప్రదర్శించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సాజిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు కూడా వారి ఇంట్లో ఎవరైనా పొగాకు ఉత్పత్తులు వాడుతుంటే వాటి వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. గుండె, ఊపిరితిత్తులు, కాలేయం అవయవాలు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు. ధూమపానం తాగేవారి పక్కన ఉండటం కూడా మంచిదికాదన్నారు. ఉపాధ్యాయులు జ్యోతి, సుబ్బలక్ష్మి, అరుణ, గ్లోరి పాల్గొన్నారు.

తక్కువ రేటుకు అంబులెన్స్ సర్వీస్ చేస్తున్నాడని దాడి

ఉప్పల్: అంబులెన్స్ సర్వీస్ చేసే వ్యక్తిపై అల్లరి మూకలు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఉప్పల్ సర్కిల్ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. చిలుకానగర్ ప్రాంతానికి చెందిన సునిల్ అంబులెన్స్ సర్వీస్ చేస్తూ ఉంటాడు. నిరుపేదలకు తక్కువ రేటులో అంబులెన్స్ సర్వీస్ చేయడంపై స్థానికంగా ఉండే కొందరు అదే వ్యాపారం చేసేవారు అతడిపై కక్ష పెంచుకుని కావాలనే సర్వీసును పిలిపించుకుని ఉప్పల్ ఆదర్శనగర్ శ్మశానవాటిక వద్దకు పిలిపించి 10 మందికి పైగా వ్యక్తులు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తూ.. మూకుమ్మడిగా దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచారన్నారు. బాధితుడిని వ్యాన్‌లో తీసుకెళ్తుండగా వారి నుంచి తప్పించుకుని వచ్చాడన్నారు. ప్రస్తుతం అతడు ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని బాధిత కుటుంబసభ్యులు వాపోయారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని చెప్పారు.

బాధితుడిపై దాడి చేసిన వీడియో వైరల్..

సునీల్‌పై దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఉప్పల్ సర్కిల్ బీజేపీ నేతలు, విశ్వహిందూ పరిషత్ నేతలు గోనే శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి నిందితులను అదుపులోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దీనిపై ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా.. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రధాన నిందితులు రహీం, ఇమ్రాన్, రషీద్ ,ఇబ్రహీం, చోటు తదితరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సునీల్‌ను విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావి నూతల శశిధర్, బీజేపీ నేతలు గోనే శ్రీకాంత్ తదితరులు పరామర్శించారు.

